TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# వైఎస్ఆర్‌సీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడి రెండేళ్లు

రాష్ట్రంలో వైఎస్ఆర్‌సీపీ అరాచక, విధ్వంసక పాలనకు ప్రజలు చరమగీతం పాడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరదాల మాటున బంధించి, ప్రజల గొంతు నొక్కిన పాలనకు ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గత పాలనపై విమర్శలు : రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలు, కులాలు, మతాలపై దాడులు జరిగిన కాలానికి ప్రజలు ముగింపు పలికారని మంత్రి అన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. ఐదేళ్లపాటు భయాందోళనలు, కక్షసాధింపులు, రాజకీయ వేధింపులతో రాష్ట్ర అభివృద్ధి దెబ్బతిన్నదని ఆరోపించారు.రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు సహా అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన పాలనకు ప్రజలు ముగింపు పలికారని



పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పరిశ్రమలు రాష్ట్రాన్ని వీడి వెళ్లడంతో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు కోల్పోయామని అన్నారు.అభివృద్ధి దిశగా రాష్ట్రం : ప్రజల ఆశీర్వాదాలు, కేంద్ర ప్రభుత్వ సహకారం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతుతో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో నడుస్తోందని మంత్రి తెలిపారు. "పరిశ్రమలను భయపెట్టి తరిమేసిన పాలన మీది, పరిశ్రమలను తీసుకొచ్చే పాలన మాది.


అంటూ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వస్తున్నాయని ఆనం పేర్కొన్నారు. యువనేత నారా లోకేశ్ దేశ, విదేశాల్లో పర్యటిస్తూ పెట్టుబడులను ఆకర్షించి యువతకు అనేక రంగాల్లో ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు.రాష్ట్ర పునర్నిర్మాణం వేగవంతం : అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందని చెప్పారు. గత పాలన విధ్వంసానికి ప్రతీకగా నిలిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి ఆనం రామనారా యణరెడ్డి వెల్లడించారు. డీఎస్సీ తప్పుడు ప్రచారంపై హోం మంత్రి అనిత : ఇదిలా ఉండగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఏ ఆత్మ చెప్పిందని జగన్ 9 నెలల తర్వాత విషప్రచారం మొదలుపెట్టారని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. 'గుడ్డ కాల్చి ముఖాన వేస్తే తుడుచుకునే పరిస్థితుల్లో లేం. ఎవరు కాల్చారు, ఏ ఉద్దేశంతో కాల్చారో ప్రజలకు ప్రతిదీ బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని స్పష్టం చేశారు.తప్పుడు ప్రచారాలపై క్రిమినల్ కేసులు: ప్రజలకు అర్థమయ్యేలా సమాధానం చెబుతామని, విషప్రచారాలను కట్టడి చేస్తామని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిలో అత్యధిక శాతం టీడీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైనవారేనని గుర్తు చేశారు.

# జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీల నియామకం



**అమరావతి, జూన్4 :** జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ) నియ మించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు. 25 పార్లమె ంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయి సమాచా రాన్ని పరిశీలించి పార్టీ బాధ్యతల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.



**అమరావతి, జూన్ 4:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాధ్యతగా సైకిల్ వినియో గించాలని అన్నారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణం చేయ నున్నట్లు చెప్పారు. ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోం దన్నారు.ప్రకృతిని కాపాడుకోవ డం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందని, ఇంధన వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పు లకు నాంది పలుకుతాయన్నారు. 'నా దేశం నా బాధ్యతలో' భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలన్నారు. ఇంధన సంక్షో భాన్ని దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామని తెలిపారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యా వరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముం దుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# టీటీడీ "కల్తీ నెయ్యి" కేసు అప్‌డేట్స్ అక్రమ నగదుతో నిందితుల "రియల్" దందా

వైఎస్సార్సీపీ పాలనలో టీటీడీకి లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసిన ముఠా భారీగా స్థిరాస్తులు కొనుగోలు చేసింది. పోగేసిన అక్రమ నగదుతో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నిగ్గు తేల్చింది. దాదాపు రూ.45 కోట్ల విలువైన వాణిజ్య, నివాస స్థలాల కొనుగోలు చేయడంతో పాటు భారీ భవనాల నిర్మాణం కూడా చేపట్టినట్లు ప్రాథమికంగా గుర్తించింది.టీటీడీకి సరఫరా ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, మాల్ గంగా డెయిరీల ముసుగులో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా డెయిరీ ప్రతినిధులు ఇతర నిందితులతో కలిసి భారీ ఎత్తున హవాలా లావాదేవీలు జరిపినట్లు ఈడీ నిర్ధారించింది. కల్తీ నెయ్యి సరఫరా ద్వారా కూడబెట్టిన అక్రమార్జనను పలు వ్యాపార సంస్థల ద్వారా మళ్లించి స్థిరాస్తి రంగంలో పెట్టుబడులుగా మార్చినట్లు తేల్చింది. నిందితులంతా కలిసి మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించింది.వైఎస్సార్సీపీ హయాంలో టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా 15




ప్రాంతాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు చేసింది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లైనా పొమిల్ జైన్, విపిన్ జైన్, ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్, వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డా, దిల్లీలోని హవాలా ఏజెంట్ ఆశిష్ అగర్వాల్, మనీ లాండరింగ్‌కు వీలుగా నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించిన మహేష్‌కుమార్ రొహిరా, అజయ్‌కుమార్ సుగంధ్‌తోపాటు రాజేష్ మన్‌సుఖ్‌లాల్ చావ్డా, మచీంద్ర శాంతారామ్ లంకేల ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు.అదేవిధంగా దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, అహిల్యనగర్‌లోని మాల్‌గంగా డెయిరీ, రూర్కీలోని భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రాంగణాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల వద్ద రూ.60 లక్షల నగదుతో పాటు కీలక పత్రాలూ స్వాధీనం చేసుకున్నారు బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ సాగిన సోదాలపై ఈడీ ఓ ప్రకటన విడుదల చేసింది.: టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన ముఠా ఆ అక్రమ సొత్తుతో దేహ్రాదూన్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో రూ.7.80 కోట్లతో మూడు వాణిజ్య స్థలాలు కొన్నట్లు ఈడీ గుర్తించింది. భోలేబాబా డైరెక్టర్ పొమిల్ జైన్ తన సంస్థ హర్ష్ ట్రేడింగ్ కంపెనీ ఖాతా నుంచి 1.18 కోట్లు మళ్లించుకుని ఆ సొత్తుతో భారీ భవనం నిర్మించినట్లు తేల్చింది. రూ.1.36 కోట్లు, రూ.79.55 లక్షలతో మరో రెండు ఆస్తులు, రూ.3.41 కోట్లు వెచ్చించి పలుచోట్ల స్థిరాస్తులు సమకూర్చుకున్నట్లు గుర్తించింది.ఇవేగాక మరికొన్ని స్థిరాస్తులు కొన్నట్లు తేలడంతో ఈడీ ఆరా తీస్తోంది. పలు సంస్థల ఖాతాల నుంచి వేతనాల పేరిట కోట్లు తీసుకుని వాటితోనూ భారీగా ఆస్తులు కొన్నట్లు, నిందితులు వారి అక్రమ సంపాదనను వేరే ఖాతాల్లోకి మళ్లించేందుకు, బోగస్ కంపెనీల నెట్‌వర్క్, నకిలీ లావాదేవీల ఇన్‌వాయిస్‌లు సృష్టించినట్లు ఈడీ గుర్తించింది. పొమిల్ జైన్, విపిన్ జైన్ విజయవాడ, చెన్నై, హైదరాబాద్, గుజరాత్, దిల్లీ, గ్వాలియర్ తదితర ప్రాంతాల్లోని హవాలా ఏజెంట్ల ద్వారా మనీ రూటింగ్ చేసినట్లు ఈడీ తేల్చింది.భోలేబాబా డెయిరీ 2019-24 మధ్య 59 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తమ సంస్థతో పాటు వైష్ణవి, మాల్‌గంగా, ఏఆర్? డెయిరీల ద్వారా టీటీడీకి సరఫరా చేసింది! తద్వారా రూ.235 కోట్ల అనుచిత లబ్ధి పొందింది. ఈ నగదును భోలేబాబా, దాని అనుబంధ సంస్థలైన హర్ష్ ట్రేడింగ్ కంపెనీ, హర్ష్ ఫ్రెష్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, వాటికి సంబంధించిన కీలక వ్యక్తుల బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి హవాలాకు పాల్పడింది. ఆ అక్రమార్జనతోనే స్థిరాస్తులు కొన్నట్లు ఈడీ గుట్టురట్టు చేసింది.

# సీఐ చిన్న మల్లయ్యను ఉద్యోగం నుంచి తొలగించిన ఏపీ ప్రభుత్వం

**పల్నాడు జిల్లా:** అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న సీఐ చిన్న మల్లయ్య ఉద్యోగం ఊడింది. ఆయన్ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మల్లయ్యను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు సుప్రీం కోర్టులో కూడా సీఐ చిన్న మల్లయ్యకు ఎదురు దెబ్బ తగిలింది. సుప్రీంకోర్టులో చిన్న మల్లయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వీఎస్ మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఫిర్యాదుదారు, పిటిషనర్ మధ్య పరస్పర అంగీకార పూర్వకమైన సంబంధాలున్నాయని సీఐ చిన్న మల్లయ్య తరఫున లాయర్ కోర్టులో వాదనలు వినిపించారు. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొ



ంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ ఆశించలేరని జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు. వెంటనే స్పందించిన లాయర్.. సీఐ, ఫిర్యాదుదారు మధ్య పరస్పరం అంగీకారం ఉన్నట్లు సాక్ష్యాలు కూడా ఉన్నాయన్నారు. ఇద్దరి మధ్య వాట్సాప్ కాల్స్, నగదు లావాదే వీలకు సంబంధించిన వివరాలు కూడా పిటిషన్‌తో పాటూ అందజే శామన్నారు. సీఐకి వ్యతిరేకంగా మహిళ తప్పుడు కేసు పెట్టారని కోర్టుకు వివరించారు. ఏపీ హైకోర్టు చిన్నమల్లయ్య పిటిషన్‌పై ఇచ్చిన ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోబోమని.. ముందస్తు బెయిల్ ఇవ్వడం కుదరదని పిటిషన్‌ను ధర్మా సనం డిస్మిస్ చేసింది. వినుకొండ మం డలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ సీఐ చిన్న మల్లయ్య కత్తితో బెదిరించి తనపై అత్యా చారానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. వినుకొ ండ రూరల్ పోలీసులు విచారణ జరిపి ఏప్రిల్ 29న ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి సీఐ చిన్నమల్లయ్య కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయన ముందస్తు బెయిల్ కోసం గత నెల 14న హైకోర్టును ఆశ్రయించగా ఆ పిటిషన్‌ను కొట్టేశారు. సుప్రీం కోర్టులో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేయగా.. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని తాజాగా సుప్రీం కోర్టు కూడా కొట్టేసింది. సుప్రీం కోర్టులో కూడా ఊరట దక్కకపోవడంతో సీఐ చిన్న మల్లయ్య పోలీసులకు లొంగిపోతారనే చర్చ కూడా జరుగుతోంది.

# వైసీపీ విధ్వంసానికి ముగింపు.. అభివృద్ధి యుగానికి నాంది

**అమరావతి, జూన్4 ():** రాష్ట్రంలో వైసీపీ పా లన అంతమై నేటికి రెండేళ్లు పూర్తయ్యాయని ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యా నించారు. ప్రజావ్యతిరేక పాలనకు ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన రోజు ఇదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ఘన విజయం రాష్ట్ర చరిత్రలో మైలురాయి అని ఉద్ఘాటించారు. (గురువారం) వెలగపూడిలోని సచి వాలయంలో మీడియాతో మంత్రి మండిపల్లి మాట్లాడారు. జగన్ అరాచక, విధ్వంసక పాలనకు ప్రజలు శాశ్వతంగా చరమగీతం పాడారని చెప్పుకొచ్చారు.వైసీపీ సైకో విధానాల నుంచి రాష్ట్ర ప్రజలు విముక్తి పొందారని మంత్రి మండిపల్లి తెలిపారు. రాష్ట్రాన్ని బందిపోటు దొంగల ముఠాలా నడిపిన పాలనకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. వ్యక్తిగత కక్షలు, వేధింపుల



రాజకీయాలకు ప్రజలు స్వస్తి పలికారని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు కూటమికి అఖండ మద్దతు ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి బాట పట్టిందని చెప్పుకొచ్చారు.

# గొడ్డలి పార్టీ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారు

**అమరావతి, జూన్4 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు. వైసీపీ రాక్షస పాలన విముక్తికి రెండేళ్లని చెప్పుకొచ్చారు. వెన్ను పోటుకు కాదని.. ప్రజా విముక్తికి ప్రజలు తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ రాజక ీయాలకు 2024లో ప్రజలు చరమగీతం పాడా రన్నారు. (గురువారం) వెలగపూడిలోని సచివ ాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారు..వైసీపీ నిరసనలు ప్రజల తీర్పును అవమానించే చర్యగా మంత్రి అచ్చెన్నాయుడు అభివర్ణించారు. జగన్ హయాంలో ప్రజా స్వామ్యానికి తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో ప్రజలు భయంతో జీవిం చారని అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కిన పార్టీ వైసీపీ అని ఆగ్రహించారు. ప్రజల్లో తిరగని జగన్.. ప్రజల



గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పరదాల చాటున పాలన చేసిన రోజులను ప్రజలు మరిచిపోలేదని చెప్పుకొచ్చారు. రైతులు, యువత, మహిళలను వైసీపీ మోసం చేసిందని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ అభి వృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు..ప్రతీకార రాజకీ యాలకు వైసీపీ పెట్టింది పేరని మంత్రి అచ్చె న్నాయుడు ఆక్షేపించారు. పరిశ్రమలను తరి మేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని దుయ్యబట్టారు.

# శ్రీవారి లడ్డూ విక్రయాల్లో సరికొత్త రికార్డు మే నెలలో 1.21 కోట్ల కోనుగోళ్లు

**తిరుమల:** కలియుగ వైకుంఠం తిరుమల గిరులు భక్తజన సంద్రమయ్యాయి. అశేషంగా తరలివస్తున్న భక్త కోటికి శ్రీవారి దివ్య ప్రసాదమైన 'లడ్డూ' తియ్యని అనుభూతిని పంచుతోంది. మే నెలలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల విక్రయాలు సరికొత్త రికార్డులను అందుకున్నాయి. ఈ ఏడాది ఒక మే నెలలోనే సుమారు 25 లక్షల మందికిపైగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ నేపథ్యంలో ఆశేషంగా శ్రీవారి సేవలో పాల్గొన్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా లడ్డూ ప్రసాదాలు విక్రయాలు జరిగాయి. కోటి 21 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. గత ఏడాది మే నెలలో కోటి 10 లక్షల లడ్డూలు కొనుగోలు చేస్తే ఈ ఏడాది అదనంగా 11 లక్షల లడ్డూ ప్రసాదం విక్రయాలు జరిగాయి. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను టీటీడీ తయారు చేస్తోంది. రద్దీ సమయాల్లో అదనంగా లడ్డూలను తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచుతుంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో



తెలిపింది. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచిన శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతోందని పేర్కొంది.విక్రయాల జోరు: 2025 ఏడాదికి లడ్డూ విక్రయాల్లో టీటీడీ సరికొత్త రికార్డులు సృష్టించింది. 2024తో పోలిస్తే విక్రయాలు సుమారు పది శాతం మేర పెరగడం విశేషం. లడ్డూల నాణ్యత, రుచిపై పూర్తి సంతృప్తి వ్యక్తం కావడంతో విక్రయాలు జోరందుకున్నాయి. 2024లో 12.15 కోట్లుగా ఉన్న లడ్డూ విక్రయాలు 2025 నాటికి 13.52 కోట్లకు చేరాయి. అంటే 2025లో 1.37 కోట్లు అదనంగా అమ్ముడయ్యాయి.గత దశాబ్ద కాలంలోనే ఎన్నడూ లేనివిధంగా డిసెంబరు 27న రికార్డు స్థాయిలో అత్యధికంగా 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. ప్రతిరోజూ సుమారు 4 లక్షల లడ్డూలను నిరంతరాయంగా 'పోటు'లో సిద్ధం చేస్తున్న టీటీడీ, రద్దీ పెరిగే ప్రత్యేక దినాల్లో 8 నుంచి 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా ఉంచుతోంది.శ్రీవారి పోటులో సుమారు 700 మంది శ్రీవైష్ణవ బ్రాహ్మణులు రెండు షిఫ్టుల్లో 24 గంటల పాటు శ్రమిస్తున్నారు. అత్యంత నియమ నిష్ఠలతో సంప్రదాయబద్ధంగా స్వామివారి లడ్డూలు తయారు చేస్తున్నారు. ఇటీవల నెయ్యి ఇతర దినుసుల విషయంలో టీటీడీ తీసుకున్న కఠిన నిర్ణయాలతో లడ్డూ నాణ్యత, రుచి మెరుగుపడిందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

